సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



ఉద్యాన పంటల్లో సస్యరక్షణ

టమాటా, బెండ, వంగ, కాకర, జామ పంటల్లో ప్రధాన సమస్యలను ఉద్యాన శాస్త్రవేత్తలు గుర్తించారు. 10లో▸



తెగిన రోడ్డు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి కొట్టుకుపోవడంతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 10లో▸



పడకేసిన పారిశుద్ధ్యం!

పరిగి పట్టణంలోని ఆయా కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

కంకల్ వాసికి డాక్టరేట్ పట్టా



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న జియా ఉర్ రెహ్మాన్

పూడూరు: మండలంలోని కంకల్ గ్రామానికి చెందిన జియా ఉర్ రెహ్మాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఫిజిక్స్‌లో డాక్టరేట్ పట్టా పొందారు. ఇస్రో చైర్మన్ నారాయణ్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

ఉచిత ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోండి

ఐఈఆర్‌పీ వేణుగోపాల్



బొంరాస్‌పేట: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులైన విద్యార్థులకు అలింకో సంస్థ వారు పలురకాల ఉపకరణాలు ఉచితంగా అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐఈఆర్‌పీ వేణుగోపాల్ తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 18 సంవత్సరాలలోపు వారు, 40శాతం వికలత్వం గల విద్యార్థులు అర్హులన్నారు. అందుకు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఆదాయ ధ్రువపత్రాలను మండల కేంద్రంలోని ఐఈఆర్‌సీ (భవిత) సెంటర్‌లో అందజేశాయాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 29న వికారాబాద్‌లోని ఎమ్మార్సీ వద్ద ప్రత్యేక క్యాంపు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9603875349లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఫీవర్ సర్వే చేయాలి

డీఎంహెచ్‌ఓ లలితాదేవి



ఆస్పత్రికి వచ్చిన వృద్ధుడితో మాట్లాడుతున్న లలితాదేవి

యాలాల: భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో పెరుగుతున్న మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ, టైఫాయిడ్ తదితర జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లేబర్ రూంను వినియోగంలోకి తేవాలన్నారు. ప్రతి రోజూ ఎంత మందికి పరీక్షలు చేస్తున్నారు? ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నారని ల్యాబ్ టెక్నీషియన్ భారతిని అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ఆస్పత్రికి దగ్గుతో వచ్చిన ఓ వృద్ధుడికి టీబీ పరీక్షలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ స్రవంతి, పీహెచ్‌ఎన్ విజయసుశీల, సూపర్‌వైజర్ శోభారాణి, ఏఎన్‌ఎంలు శ్రీదేవి, జగదీశ్వరి, సంగీత సిబ్బంది బసయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాంచందర్‌రావు వ్యాఖ్యలు అర్థరహితం

బంట్వారం: రాజకీయ రంగంలో బీసీ రిజర్వేషన్లపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వికారాబాద్‌లో చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ జగన్నాథంయాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ జనాభాలో 56 శాతం బీసీలు ఉన్నారనే విషయాన్ని రాంచందర్‌రావు గుర్తుంచుకోవాలన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లోపు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో భజన



సామూహిక భజన చేస్తున్న మహిళలు

అనంతగిరి: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని వికారాబాద్ సమీపంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురు వారం అక్క మహాదేవి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక భజన చేసి శివపార్వతుల పాటలను ఆలపించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పక్కాగా విలేజ్ మ్యాపింగ్

సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రక్రియ

- ఫైలెట్ ప్రాజెక్టు కింద జిల్లా ఎంపిక
- నేటి నుంచి సర్వే పనులు ప్రారంభం
- ముందుగా గ్రామాల సరిహద్దుల నిర్ధారణ

వికారాబాద్: రెవెన్యూ రికార్డుల విషయంలో సర్వేకు ఉన్న ప్రాధాన్యత ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రైతుల మధ్య పొలాల సరిహద్దు సమస్యలు.. మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాలు.. రాష్ట్రాల సరిహద్దుల విషయంలో నిత్యం ఏదో ఒక చోట వివాదం చెలరేగుతూనే ఉంటుంది. విలేజ్ మ్యాపింగ్ విషయంలోనూ అనేక సమస్యలు ఉన్నాయి. ఎలాంటి సాంకేతికత లేని రోజుల్లో చేసిన సర్వే మ్యాపులే నేటికీ ఆధారం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సాంకేతికతను జోడించి పక్కాగా గ్రామాల సరిహద్దులు నిర్ణయించే సర్వే చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మన జిల్లాను ఫైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గురువారం నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకు స్థానిక సర్వేయర్లు సర్వే ఆఫ్ ఇండియా సభ్యులకు సహకరించనున్నారు.

డిజిటల్ పరికరాల సాయంతో..

డిజిటల్ పరికరాల సాయంతో శాటిలైట్ సేవలను వినియోగిస్తూ పక్కాగా సర్వే చేపట్టనున్నారు. ముందుగా గ్రామాల సరిహద్దులు నిర్ణయించనున్నారు. జిల్లాలో మొత్తం 594 జీపీలు.. 510 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. రెవెన్యూ గ్రామాల ఆధారంగా సర్వే చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రామ సరిహద్దుతో కూడిన మ్యాపింగ్‌ను జిల్లా అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు. భవిష్యత్తులో ఈ మ్యాప్‌లు కీలకం కానున్నాయి. జిల్లాలో సర్వే ప్రక్రియ విజయవంతమైతే రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో చేపడతారు. ప్రస్తుతం జిల్లా అధికారులు సర్వే ఆఫ్ ఇండియా అధికారులకు సహకరిస్తున్నారు.

కర్ణాటక సరిహద్దులు తేలేనా..?

మన జిల్లాకు కర్ణాటకతో సరిహద్దు వివాదం చాలా కాలంగా నడుస్తోంది. తాండూరు నియోజకవర్గం



పరిధిలోని బషీరాబాద్, తాండూరు, పెద్దేముల్, వికారాబాద్ నియోజకవర్గంలోని బంట్వారం, అలాగే కొడంగల్ మండలానికి కర్ణాటకతో సరిహద్దు వివాదం ఉంది. తెలంగాణ అటవీ శాఖకు చెందిన వేల ఎకరాలను కర్ణాటక వాసులు కబ్జా చేసినట్లు జిల్లా అధికారులు గుర్తించారు. ఈ విషయమై గతంలో రెండు ప్రాంతాల ప్రజల మధ్య గొడవలు కూడా జరిగాయి. కాగ్నా నదిలో ఇసుక వాటా విషయంలోనూ తగాదాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం చేపట్టే సర్వే వివాదానికి ముగింపు పడుతుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

సహకరించాలి



గ్రామాల సరిహద్దు నిర్ధారణ కోసం సర్వే ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న సర్వేకు అందరూ సహకరించాలి. సర్వేపై ఎలాంటి సందేహాలు వద్దు. ఈ ప్రక్రియ పూర్తయితే చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. పొలాల మధ్య, గ్రామాల మధ్య సరిహద్దు సమస్యలు ఉండవు.

– రాంరెడ్డి, ఏడీ సర్వే, ల్యాండ్ రికార్డ్స్

కళాశాల విద్యే కీలకం



విద్యార్థులతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

- మార్కులే కాదు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి
- ఇంటర్ జిల్లా నోడల్ ఆఫీసర్ శంకర్‌నాయక్

బొంరాస్‌పేట: విద్యార్థికి ఉద్యోగం, ఉపాధితో బంగారు భవిష్యత్తుకు జూనియర్ కళాశాల విద్యే మూలాధారంగా ఉంటుందని ఇంటర్ జిల్లా నోడల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ రోజారాణితో కళాశాల నిర్వహణ, విద్యా ప్రగతి, వసతులపై చర్చించారు. నిధుల వినియోగానికి కమిటీ ఆమోదం చేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయని తెలిపారు. భవన నిర్మాణ పనులు సాగుతున్నాయని అన్నారు. మౌలిక వసతులు, సదుపాయాలను కల్పించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో స్థానిక కళాశాల విద్యార్థులకు బెంచీలు, కార్యాలయానికి బీరువాలు, కుర్చీలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి అన్నారు. తల్లిదండ్రుల కలలు నిజం చేయడానికి తపించాలని విద్యార్థులకు సూచించారు. అధ్యాపక బృందం, విద్యార్థుల స్పందన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పోటీతత్వాన్ని ఎదుర్కోవడానికి తగు సూచనలిచ్చారు. మార్కులే కాదు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని బోర్డుపై రాసిన పేర్లను చెబుతున్న అవధాని అనంతప్ప

కళ్లకు గంతలతో గణితావధానం

- రిటైర్డ్ ఉపాధ్యాయుడు అనంతప్ప ప్రతిభ
- ఆశ్చర్య పోయిన విద్యార్థులు

తాండూరు టౌన్: కళ్లకు గంతలు కట్టుకుని బోర్డుపై రాసిన పదాలను ఓ గణితావధాని అలవోకగా చెప్పడంతో విద్యార్థులు ఆశ్చర్యపోయారు. గురువారం తాండూరు పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ప్రముఖ గణితావధాని, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోకట్‌కు చెందిన అనంతప్ప అవధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు మాయా కూడిక, మాయా చదరంపై మెలకువలు నేర్పించారు. అనంతరం మెమొరీ శతావధానంలో భాగంగా, విద్యార్థులు బోర్డుపై 100 వరకు రాసిన ప్రముఖులు, వాహనాలు, జంతువులు, వస్తువుల పేర్లను కళ్లకు గంతలు కట్టుకుని చెప్పారు. ఏ ఒక్క పేరు తప్పు చెప్పకుండా అన్నీ కరెక్టుగా చెప్పడంతో విద్యార్థులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధన చేస్తే సాధ్యం కానిది ఏదీ లేదన్నారు. విద్యార్థులు కష్టపడి చదవడం కాకుండా ఇష్టపడి చదివేలా చూడాలన్నారు.ఎలాంటి సమస్యలుఉన్నా సులువైన విధానంలో సమాధానం రాబట్టేలా వారికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలన్నారు. తాను తొలినాళ్లలో శిశుమందిర్‌లోనే ఉపాధ్యాయునిగా జీవనం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు డీ విజయలక్ష్మి,కార్యదర్శి అనంతరెడ్డి,కోశాధికారి రాంరెడ్డి, ఆచార్య, మాతాజీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న యాదగిరి

- తాండూరు మున్సిపల్ నూతన కమిషనర్ యాదగిరి

తాండూరు: తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా బి.యాదగిరి నియమితులయ్యారు. ప్రభుత్వం బుధవారం రాత్రి రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీలో పనిచేస్తూ వెయిటింగ్‌లో ఉన్న యాదగిరిని తాండూరుకు బదిలీ చేశారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న విక్రమ్‌సింహారెడ్డి కొంత కాలంగా తాండూరు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తూ వచ్చారు. రెండు రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు చేయగా సీనియర్ అసిస్టెంట్ రమేష్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డిని తప్పించడం చర్చనీయాంశమైంది. గురువారం ఆయన రిలీవయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ యాదగిరి మాట్లాడుతూ.. మున్సిపల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పౌర సేవలను మరింత మెరుగు పరుస్తామన్నారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా సేవలు అందిస్తామని చెప్పారు.

మున్సిపల్ కమిషనర్, మేనేజర్‌కు ఏసీబీ మెమోలు

గత గురువారం వరకు తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన విక్రంసింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డికి గురువారం ఏసీబీ మెమోలు జారీ అయ్యాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మున్సిపల్ కార్యాలయానికి చేరాయి.

దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

భూభారతికి ప్రాధాన్యత ఇవ్వాలి

- రంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూ భారతి దరఖాస్తులు, ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశించారు. భూభారతి దరఖాస్తులు, ఇతర అంశాలపై సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులతో గురువారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో ఆయా మాడ్యుల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? ఎంత మందికి నోటీసులు ఇచ్చారు? క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా రోజువారీగా పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, పరిష్కారంకాకుంటే దరఖాస్తుదారుడికి సమా చారం అందించాలని ఆయన సూచించారు. గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని సివిల్ సప్లయ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములను గుర్తించి, ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని, ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సంగీత, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

పీర్ల మసీదులో బోధన





మేడికొండలో గణేశ్ మండపంలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు (ఇన్‌సెట్‌లో) రాకంచర్ల మసీదులో బోధన చేస్తున్న టీచర్

ప్రభుత్వ పాఠశాలలోకి వర్షపు నీరు చేరడంతో..

- మేడికొండలో గణేశ్ మండపంలో స్కూల్ నిర్వహణ
- బిల్లులు రాకపోవడంతో భవనం అప్పగించని కాంట్రాక్టర్
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

పూడూరు: గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చాలా చోట్ల శిథిల భవనాల్లో, వర్షాలకు ఉరుస్తున్న గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు స్కూళ్ల బిల్డింగులు లీకేజీ అవుతున్నాయి. మండలంలోని మేడికొండ పాఠశాల భవనం లీకేజీ అవుతుండటంతో టార్పాలిన్ కప్పి ఉంచారు. ప్రస్తుతం గణేశ్ మండపంలో స్కూల్ నిర్వహిస్తున్నారు. రాకంచర్ల గ్రామంలో పీర్ల మసీదులో బోధన చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రాకంచర్ల పాఠశాలలోకి నీరు చేరింది. విద్యార్థులు స్కూల్‌లోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఉపాధ్యాయులు స్కూల్ పక్కన ఉన్న పీర్ల మసీదులో పాఠశాలను నిర్వహిస్తున్నారు. బెంచీలు వేసి 30 మంది విద్యార్థులకు బోధన చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మన ఊరు మన బడి పథకం కింద నూతన భవనాలు మంజూరయ్యాయి. కొన్ని చోట్ల పనులు పూర్తయినా బిల్లులు రాలేదు. దీంతో కాంట్రాక్టర్లు స్కూళ్లకు తాళాలు వేసుకున్నారు.

మేడికొండలో..

మండలంలోని మేడికొండ ప్రాథమిక పాఠశాలలో 15మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్ బిల్డింగ్ శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం మండల పరిషత్ నిధుల నుంచి నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం రూ.5.5లక్షలు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండు గదులు నిర్మించాడు. బిల్లు మంజూరు కాకపోవడంతో భవనాన్ని పాఠశాలకు అప్పగించలేదు. వర్షాలు పడిన ప్రతిసారీ గణేశ్ మండపంలో తరగతులు నిర్వహిస్తున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

మేడికొండ, రాకంచర్ల ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లీకేజీ అవుతున్నాయి. దీంతో పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, అసంపూర్తిగా ఉన్న భవనంలో పాఠశాలల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. రాకంచర్లలో అదనపు భవనం కోసం ప్రతిపాదనలు పంపాం.

– సాయిరెడ్డి, ఎంఈఓ పూడూరు

హెచ్ఎండీఏ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయండి

ఇబ్రహీంపట్నం రూరల్: తొర్రూర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్ఎండీఏ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం అడిషన్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూరల్‌లో సర్వే నంబర్ 383లో 117 ఎకరాల్లో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన వెంచర్‌లో ప్లాట్లు కేటాయించి నేటికీ రిజిస్ట్రేషన్ చేయలేదని అన్నారు. భూములు కోల్పోయిన తమకు 2022లో ఎకరానికి 300 గజాల చొప్పున కేటాయించినప్పటికీ ఇప్పటికీ రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. పూర్తి హక్కులు కల్పిస్తామని చెప్పిన నాలుగేళ్లు గడిచినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి హక్కులు కల్పించాలని కోరారు.

గల్లా ఎగరేస్తున్న గల్లీ లీడర్స్!

తాము చెప్పిందే చేయాలంటూ అల్టిమేటం

- లేదంటే బ్లాక్ మెయిల్ రాజకీయాలతో బెదిరింపులు
- హడలిపోతున్న అధికారులు, ద్వితీయ శ్రేణి నాయకులు

ధారూరు: జిల్లాలోని అధికార పార్టీకి చెందిన కొంత మంది గల్లీ లీడర్లు అధికారులు, ద్వితీయ శ్రేణి నేతలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. పలువురు ప్రముఖ నాయకులతో వీరికున్న సంబంధాన్ని చూసి అధికారులు సైతం వీరంటే జడుసుకుంటున్నారు.

❖ ధారూరుకు చెందిన ఓ గల్లీలీడర్ అటవీశాఖలో తనకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలంటూ జిల్లాకు చెందిన ఇద్దరు రాష్ట్ర స్థాయి నాయకులతో సిఫారసు చేయించాడు. ఆతర్వాత ఫారెస్ట్ శాఖకు చెందిన అధికారులు తన మాట వినడం లేదంటూ వారికి ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో రాస్నం ఫారెస్ట్ బీట్‌లో వందలాది ఎకరాల అటవీ భూములను అక్రమార్కుల నుంచి స్వాధీనం చేసుకున్న ఓ సిన్సియర్ ఆఫీసర్‌ను బదిలీ చేయించేందుకు పావులు కదుపుతున్నాడనే ప్రచారం జోరందుకుంది. రాస్నం గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు తన పొలానికి వెళ్లేందుకు అటవీ భూమి నుంచి వేస్తున్న



రోడ్డును సదరు అధికారి అడ్డుకున్నారు. రాస్నంతో పాటు జుంటుపల్లి అడవిలో చెట్లను నరికేసి పొలాలుగా మార్చిన స్థలాలను కబ్జా చెర నుంచి విడిపించారు. ధారూరు ఫారెస్టు పరిధిలోని ఏడుఖానల వద్ద అన్యాక్రాంతానికి గురైన 25 ఎకరాల అటవీ భూమిని స్వాధీనం చేసుకుని, ఇందులో 11 వేల మొక్కలు నాటించారు. ఇలా ప్రజా, ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్న అధికారి వైఖరి గల్లీ లీడర్‌కు నచ్చడం లేదు. ఈవిషయాన్ని సదరు లీడర్ జిల్లా స్థాయి అటవీ అధికారికి చెప్పి చర్యలు తీసుకోవాలని కోరాడు. దీనిపై స్పందించిన అధికారి ఆయన నామాట కూడా వినడు.. మీరే బదిలీచేయించండి అని సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అధికార పార్టీకి చెందిన ప్రముఖ నాయకులను కలిసిన గల్లీ లీడర్ ఫారెస్ట్ ఉన్నతాధికారులతో మాట్లాడించి అధికారి బదిలీకి రంగం సిద్ధం చేయించినట్లు తెలుస్తోంది. నేడో, రేపో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నా ఊరిలో నా మాటే చెల్లాలి..

బషీరాబాద్: మండలానికి చెందిన ఓ లీడర్ వ్యవహారం రాజకీయ, అధికారవర్గాలను ఆందోళనకు గురి చేస్తోంది. తన పనులు చేయించుకునేందుకు అధికారులతో పాటు తమనే బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని సొంత పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు డీసీసీ అధ్యక్షుడితో పాటు స్థానిక ఎమ్మెల్యేకూ ఫిర్యాదు చేసినా అతని తీరు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నా ఊళ్లో నా మాటే చెల్లాలి.. రాజకీయ పరంగా, అభివృద్ధి పనుల్లో మండల నాయకులు, అధికారులు నేను చెప్పిందే వినాలి. లేదంటే అడ్డుపడిన వారి పేర్లు రాసి ఆత్మహత్య చేసుకుంటా.. అంటూ బెదిరింపులకు పాల్పడటంపై అధికారులు, నేతలు విస్తుపోతున్నారు. ఈ గొడవల్లోకి ఎమ్మెల్యే స్థాయి నాయకులను సైతం లాగాలని చూశాడని మండల నాయకులు గుర్రుగా ఉన్నారు. ఇదే లీడర్ నెల రోజుల క్రితం బతికున్న ఓ రైతు చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి, అతని భూమిని కొల్లగొట్టేందుకు ప్రయత్నించాడనే ఆరోపణలు న్నాయి. భూమి బదలాయింపు కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చినా.. సకాలంలో వారు మేలుకొని పొరపాటును సరిదిద్దుకున్నారు. ఇతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్యకర్తలూ, నాయకులు పార్టీ పెద్దలకు విన్నపాలు అందించడం చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

రేపు శని అమావాస్య



అలంకరణలో స్వామివారు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఏన్కతల గ్రామంలో వెలిసిన శనైశ్చర స్వామి శని అమావాస్యకు ముస్తాబయ్యాడు. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకోనున్నారు. శని అమావాస్య, శని త్రయోదశి రోజున స్వామివారికి అత్యంత ప్రీతి పాత్రమైన నల్లని దుస్తులు, నువ్వుల నూనెతో అభిషేకం చేస్తే కోర్కెలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశామని దేవాదాయ శాఖ అధికారి నరేందర్ తెలిపారు.

గుట్కా తరలిస్తున్న డీసీఎం పట్టివేత



పోలీస్‌స్టేషన్ ఎదుట డీసీఎం

పరిగి: గుట్కా తరలిస్తున్న డీసీఎంను పట్టుకున్న సంఘటన పట్టణ కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు స్థానిక బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ముందు వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక పాసింగ్ డీసీఎం హైదరాబాద్ వైపు వెళ్తుండగా ఆపి విచారించారు. అందులో గుట్కా వాసన రావడంతో గట్టిగా నిలదీశారు. అక్రమంగా గుట్కా తరలిస్తున్నట్లు గమనించి డీసీఎంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ మోహన్ క్రిష్ణను వివరణ కోరగా.. ఇప్పటివరకు కేసు నమోదు కాలేదని తెలిపారు. డీసీఎం డోర్లు ఓపెన్ కాలేదన్నారు. ఓపెన్ అయ్యాక కేసు నమోదు చేస్తామని వివరించారు.

ప్రమాదమున్నా పట్టించుకోరా!



రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్

పూడూరు: మండల పరిధిలోని మేడికొండ పంచాయతీలో హనుమాన్ ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఎలాంటి రక్షణ లేకపోవడంతోపాటు, తక్కువ ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. దీనిపై అధికారులకు పలు మార్లు గ్రామస్తులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. బడికి వెళ్లే పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దాడి చేసిన వారిని జైలుకు పంపాలి

- లేదంటే ఎస్పీ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తాం
- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనసూయ



నాగారంలో మహిళలతో ర్యాలీ నిర్వహిస్తున్న అనసూయ

ధారూరు: హోటల్ నిర్వాహకులపై మారణాయుధాలతో దాడిచేసిన నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, జైలుకు పంపించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనసూయ డిమాండ్ చేశారు. లేదంటే ఎస్పీ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడుతామని స్పష్టంచేశారు. దాడిలో గాయపడి కోలుకుంటున్న నాగారం గ్రామానికి చెందిన భారతమ్మ, అంజిని గురువారం ఆమె పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన వ్యక్తులు భారతమ్మ అంజి దంపతులతో పాటు మరో వ్యక్తిపైనా మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారని ఆవేదన వ్యక్తంచేశారు. అయినప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాజకీయ నేతల ఒత్తిడికి తలొగ్గిన పోలీసులు నామమాత్రంగా కేసులు పెట్టి తహసీల్దార్ ముందు బైండోవర్ చేయడం అన్యాయమన్నారు. ఇకనైనా నిందితులపై చట్టపరంగా హత్యాయత్నం కేసు నమోదు చేయకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. అంతకు ముందు నాగారం గ్రామానికి చెందిన మహిళలతో ర్యాలీ నిర్వహించారు.

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ

కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ





తెగులు సోకిన టమాటా పంట

కందుకూరు: ప్రస్తుతం సాగులో ఉన్న ఉద్యాన పంటలైన టమాటా, బెండ, వంగ, కాకర, జామ వంటి తదితర పంటల్లో ప్రధాన సమస్యలను ఉద్యాన శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆయా పంటలకు ఆశిస్తున్న తెగుళ్లు, పురుగులు, వాటి నివారణకు అత్యవసరంగా తీసుకోవాల్సిన అంశాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

ముందస్తు రక్షణ చర్యలివే

సూక్ష్మజీవుల మిశ్రమం యొక్క అప్లికేషన్ అనగా ట్రైకోడెర్మా, సూడోమోస్, పెసెలోమైసెస్, అజాటోబాక్టర్, ఫాస్ఫో బాక్టీరియా, పోటాస్ బాక్టీరియా, జింక్ బాక్టీరియాలను మొక్కలను నాటడానికి ముందు పశువుల ఎరువులో అభివృద్ధి చేసి పొలంలో వేసుకుంటే తెగుళ్లు, వ్యాధులు, సాగు ఖర్చు తగ్గుతాయి. కూరగాయల పంటలలో ముందు జాగ్రత్త చర్యగా నాటిన 15 రోజుల్లోపు కార్బెండజిమ్ 2గ్రా లీటరు నీటితో కలిపి నేల తడిచేలా పిచికారీ చేస్తే మట్టిలో పుట్టే రోగాలు రాకుండా చూడవచ్చు. రసం పీల్చే తెగుళ్లను నివారించడానికి లీటరు నీటికి ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ పిచికారీ చేయాలి. అన్ని ఉద్యాన పంటలు సూక్ష్మపోషక లోపం లక్షణాలను కనబరుస్తున్నట్లు గుర్తించడమైనది. మ్యాక్స్ లేదా గ్రోత్ లేదా విపుల్ లేదా స్వర్ణ పాల్ లేదా ఫార్ములాస్- 4 లేదా అర్కా వెజిటబుల్ స్పెషల్ 2- 3 గ్రా. లీటరు నీటికి పూల మొగ్గ ప్రారంభించే ముందు, పుష్పించే ముందు, పండు దశల్లో మూడుసార్లు పిచికారీ చేయాలి.

పంట గుర్తించిన సమస్య తీసుకోవాల్సిన చర్యలు

▲ **టమాటాలో..**

ఆకు ముడత లీటర్ నీటిలో ఒక మి.లీ లేదా 1.5 గ్రాముల క్లోరోథలనిల్ లేదా ఒక మి.లీ.లీటరు నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ప్రొఫికోనోజోల్ పిచికారీ చేయాలి



తెగులు సోకిన మిర్చి

▲ **బ్యాక్టీరియల్ ఎండు తెగులు..**

కాపర్‌ఆక్సీక్లోరైడ్ 30 గ్రా+స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటికి ఒక గ్రాముతో మట్టిని తడిపి, అదే మోతాదులో రసాయనాలతో ఫోలియర్‌ను పిచికారీ చేయాలి.

▲ **బూజు తెగులు..**

లీటరు నీటికి సల్ఫర్ 3 గ్రా లేదా డైఫెంకోనోజోల్ 0.5 మి.లీ లేదా సాఫ్ 2 గ్రాములు కలిపి స్ప్రే చేయాలి.

▲ **తేనెబంగ, తామర పురుగుల..**

తేమ ఎక్కువగా ఉన్నప్పుడు థయోమిథాక్సిమ్ 0.3 గ్రా. లేదా డైఫెంతురియన్ 1.25గ్రా నివారణకు లేదా అసిఫేట్ 1.5 గ్రా లేదా డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

▲ **పండు తొలుచు పురుగు ..**

వరి తవుడు+బెల్లం+మోనోక్రోటోఫాస్ లేదా క్లోరోపైరీఫాస్‌తో విషపు ఎరలను వరుసల మధ్య వేయాలి. అబామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ+డైక్లోరోవాస్ 1 మి.లీ లేదా థయోడికార్బ్ 1 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



టమాటను ఆశించిన పురుగు

▲ **పాము పొడ తెగులు**

ట్రైజోఫాస్ 2 మి.లీ లేదా డైఫెంతురీయన్ 1.25 గ్రాము, వేప నూనె 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

▲ **కాయ కుళ్లు తెగులు..**

లీటరు నీటికి 5 గ్రా కాల్షియం నైట్రేట్‌ను వారం మధ్యలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

▲ **పూత, పిందె రాలకుండా..**

ప్లానోఫిక్స్ 3 మి.లీ+ సూక్ష్మపోషక మిశ్రమం 45 గ్రా. 15 లీటర్ల నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

▲ **వంకాయలో సస్యరక్షణ..**

కాయ, కొమ్మ రెనాక్సిపైర్ 0.3 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ+ డైక్లోరోవాస్ తొలిచే పురుగు ఒక మి.లీ లీటరుకు 5 మి.లీ వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలి.



తెగులు సోకిన వంగ

▲ **ఎర్ర నల్లి..**

సల్ఫర్ 3గ్రా లేద ఆఅబామెక్టిన్ 1.0 గ్రా. లేదా ఫెంతురియన్ 1.25 గ్రా లేదా డైకోఫాల్ 5 మి.లీ లేదా ప్రొపార్జైట్ 2 మి.లీ లీటరు నీటికి వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలి.

▲ **బెండతోటలో..**

కాయ తొలుచు పురుగు రెనాక్సిపైర్ 0.3 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ+డైక్లోరోవాస్ 1 మి.లీ లీటరు నీటికి 5 మి.లీ వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలి.

▲ **రసం పీల్చే పురుగు..**

తేమ ఎక్కువగా ఉన్నప్పుడు థయోమిథాక్సిమ్ 0.3గ్రా లేదా డైఫెంతురియన్ 1.25గ్రా లేదా ఎసిఫేట్ 1.5 గ్రా, లేదా డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

▲ **ఎర్ర పురుగు..**

సల్ఫర్ 3గ్రా లేద ఆఅబామెక్టిన్ 1.0 గ్రా. లేదా డైఫెంతురియన్ 1.25 గ్రా లేదా డైకోఫాల్ 5 మి.లీ లేదా ప్రొపార్జైట్ 2 మి.లీ లీటరు నీటికి వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలి.

▲ **కాకర,బెండలో..**

కాయ తొలుచు పురుగు సామూహిక ట్రాపింగ్ కోసం ఫెరోమోన్ ఉచ్చులు(15-20/ఎకరం)ఉంచాలి. డైక్లోరోవాస్ 1 మి.లీ లీటరు నీటికి పిచికారీ చేయాలి.

▲ **రసం పీల్చే పురుగు..**

తేమ ఎక్కువగా ఉన్నప్పుడు థయోమిథాక్సిమ్ 0.3గ్రా లేదా డైఫెంతురియన్ 1.25గ్రా లేదా ఎసిఫేట్ 1.5 గ్రా, లేదా డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

▲ **జామ..**

ఫ్రూట్ ఫ్లై సామూహిక ట్రాపింగ్ కోసం ఫెరోమోన్ ఉచ్చులు (15-20/ఎకరం) ఉంచాలి.మలాథియాన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

హిందూ ఉత్సవ సమితికి అండ

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే హామీ



ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డిని కలిసిన సమితి సభ్యులు

తాండూరు టౌన్: హిందూ ఉత్సవ కేంద్ర సమితికి తాము వెన్నంటి ఉంటామని మండలి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిలు అన్నారు. గురువారం నూతనంగా నియామకమైన తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి కార్యవర్గం మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లో వారిని వేర్వేరుగా కలిశారు. ఈసందర్భంగా హిందూ సంప్రదాయ పండగల నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు మాట్లాడుతూ.. సమితి ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు కార్యక్రమాలకు, భవన నిర్మాణానికి తదితరాలకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే ఒక విడత నిధులు మంజూరు చేశారని, విడతల వారీగా మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేస్తామన్నారని చెప్పారు. అలాగే చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కార్యాలయానికి వెళ్లగా, ఆయన అందుబాటులో లేరని తెలిపారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు పరమేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధులు రామకృష్ణ, అశోక్, గోపాల్, కుమార్ తదితరులు ఉన్నారు.

విత్తన మట్టి విగ్రహాల పంపిణీ



విత్తన గణపతి విగ్రహాన్ని అందజేస్తున్న శుభప్రద్‌పటేల్

తాండూరు: వినాయక చవితి పండగ రోజు మట్టితో చేసిన విత్తన విగ్రహాలను పూజిస్తే వృక్ష సంపద పెంచడంతో పాటు సమాజ హితానికి మేలు జరుగుతోందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు నూలి శుభప్రద్‌పటేల్ అన్నారు. గురువారం గ్రీన్ ఇండియా చాలెంజ్ హరిత సేన సంస్థ సౌజన్యంతో తాండూరు పట్టణంలోని ఎస్ఎస్‌పీ ట్రస్ట్ చైర్‌పర్సన్ శివాని, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు తాటికొండ స్వప్నపరిమళ్, విజయలక్ష్మి స్థానికులకు మట్టితో తయారు చేసిన విత్తన గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పండగపూట అందరూ మట్టితో చేసిన వినాయక ప్రతిమలనే వినియోగించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తాండూరు లెక్చరర్ ఫోరం అధ్యక్షుడు సోమనాథ్, ప్రైవేట్ స్కూల్ అసోషియేషన్ కార్యదర్శి మోహన్‌కృష్ణాగౌడ్, అసోషియేషన్ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవాబుపేట: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన సంఘటన గొల్లగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఓ వ్యక్తి పట్టాల పక్కన మృతి చెంది ఉన్నట్లు రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వెళ్లి పరిశీలించగా మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదు. ఒంటిపై తెల్లని చొక్కా, ఫార్మల్ ప్యాయింట్ ఉంది. అతని వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మృతదేహానికి వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపరిచారు. వివరాలకు 7702629707కు సంప్రదించాలని తెలిపారు.



పరిగిలో విక్రయాలకు సిద్ధంగా వినాయక విగ్రహాలు

నిబంధనలు తప్పనిసరి

గణేశ్ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

- డీజే వినియోగంపై నిషేధం
- పోలీసుల అనుమతితో నవరాత్రుల నిర్వహణ
- రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- పరిగి డీఎస్పీ శ్రీనివాస్



దోమ: ఊరూరా వినాయక చవితి సందడి ప్రారంభమైంది. మండపాల ఏర్పాట్లలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిమగ్నమయ్యారు. వివిధ రూపాల్లో గణనాథుడి విగ్రహాలను కొలువుదీర్చేందుకు బుకింగ్‌లు చేసుకొని సిద్ధమవుతున్నారు. దీంతో అధికారులు సైతం మండపాల ఏర్పాటుపై నియమనిబంధనలు పాటించాల్సిందేనని చెబుతున్నారు. ఊరురా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సూచనలు ఇస్తున్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పొందిన అనుమతి పత్రాన్ని తప్పనిసరిగా భద్రపరుచుకోవాలంటున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. వినాయక విగ్రహాల వద్ద, నిమజ్జన కార్యక్రమంలో డీజేలను నిషేధిస్తున్నామని పోలీసులు పేర్కొంటున్నారు.

ఇవి పాటించాలి

- వినాయక చవితి నేపథ్యంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు కచ్చితంగా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. ఎన్ని రోజులు పెడుతున్నారు? ఎన్ని రోజుల్లో నిమజ్జనం చేస్తున్నారు? అనే అంశాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చుకోవాలి.
- గణేశ్ మండపాలను ఏర్పాటుకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలి. మండపాల ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.
- విద్యుత్ శాఖ అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. షార్ట్ సర్క్యూట్ జరగకుండా మంచి నాణ్యమైన వైరు ఉపయోగించాలి.
- మండపాల నిర్వాహకులు మండపాల కమిటీకి సంబంధించిన వివరాలు, బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నంబర్లను పోలీసులకు అందించాలి.
- వృద్ధులు, చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శబ్ద కాలుష్యం లేకుండా స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి.
- సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. మండపాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను ఏర్పాటు చేయరాదు.
- మండపాల్లో మంటలు చెలరేగితే ఆర్పేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సమీపంలో రెండు బకెట్‌ల నీళ్లు, ఇసుక ఏర్పాటు చేసుకోవాలి.
- మండపాల వద్ద మద్యం తాగడం, పేకాట ఆడడం, లక్కీ డ్రాలు నిర్వహించడం, అసభ్యకర నృత్యాలతో ప్రదర్శనలు చేయడం, అన్యమతస్తులను కించపరిచేలా ప్రసంగాలు చేయడం పూర్తిగా నిషేధం.
- విధిగా పాయింట్ బుక్ ఏర్పాటు చేసుకోవాలి. పోలీస్ అధికారులు నిత్యం తనిఖీలు చేసినప్పుడు అందులో సమయం రాసి సంతకం చేసి వెళ్తారు.
- మండపాల్లో ఏదైనా అనుమానస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే తక్షణమే డయల్ 100 కానీ, లేదా స్థానిక పోలీసులకు లేదా జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 87126 70056కు సమాచారం అందించాలి.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

78 మందికి జరిమానా

తాండూరు టౌన్: పట్టణ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్షతో పాటు మరో 78 మందికి జరిమానా పడినట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ గురువారం తెలిపారు. జిల్లా ట్రైనీ కలెక్టర్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హర్షచౌదరి వీరికి శిక్ష విధించినట్లు చెప్పారు. వీరిలో అధికంగా మద్యం తాగి వాహనాలు నడిపిన మంబాపూర్ గ్రామానికి చెందిన గొర్ల స్టాలిన్‌కు మూడు రోజులు, ఎల్మకన్నె గ్రామానికి చెందిన నడిమింటి శ్రీనివాస్‌కు రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఇద్దరికీ చెరో రూ.3వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే ఓ మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన మరో 78 మందికి, అందరికీ కలిపి మొత్తం రూ.1.43లక్షల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

తెగిన రోడ్డు.. రాకపోకలకు పాట్లు

- కొత్త బ్రిడ్జి నిర్మాణం వద్ద కొట్టుకుపోయిన రహదారి
- మండలవాసుల నరకయాతన



తెగిపోయిన పాత రోడ్డు

బొంరాస్‌పేట: భారీ వానలకు రహదారి కొట్టుకుపోవడంతో మండలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి నుంచి మండల కేంద్రానికి ఉన్న ప్రధాన రోడ్డు ఇటీవల వానలకు తెగిపోయింది. ఈ మార్గంలో చెరువు అలుగు పారే చోట నూతనంగా డబుల్ వే వంతెన నిర్మిస్తున్నారు. తాత్కాలికంగా పాత రోడ్డు నుంచి నిత్యం రాకపోకలు జరిగేవి. కాగా ఇటీవల ఎడతెరిపిలేని వర్షాలకు వాగు ఉధృతంగా పొంగి పాత రోడ్డు ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నిత్యం మండల కేంద్రానికి వెళ్లాలంటే వాహనదారులు బుర్రి తండా, మెట్లకుంట మీదుగా 6కి.మీ దూరం నుంచి తిరిగి వస్తున్నారు. దూరభారంతో మండల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నామని పేర్కొంటున్నారు.

ఆటోవాలా.. దివాలా

మండల కేంద్రానికి నిత్యం ప్రజల రాకపోకలతో రవాణా చేసేందుకు మెట్లకుంట, తుంకిమెట్ల, పలు తండాలకు చెందిన సుమారు 30 ఆటోలున్నాయి. రహదారి బంద్ కావడంతో ఆటోవాలాలు రోజంతా దివాలా తీస్తున్నామని వాపోతున్నారు. దూరం గ్రామాల నుంచి వెళ్లేందుకు ప్రయాణికులు ముందుకు రావడం లేదంటున్నారు. దీంతో రోజు గడవడమే అగమ్యగోచరంగా మారింది. మండల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వంతెన పరిశీలన

మండల ప్రజల అవస్థలు తీర్చేందుకు రాష్ట్ర ఈజీఎస్ కమిషన్ సభ్యుడు నర్సింలుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. గురువారం సంబంధిత అధికారులతో వంతెనను పరిశీలించారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం సంపూర్ణం కాలేదని, మరిన్ని పనులు కొనసాగుతున్నాయని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. తాత్కాలిక ప్రత్యామ్నాయానికి చర్యలు చేపడతామన్నారు. మండల ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న అవస్థలను అధికారులకు వివరించారు. క్యూరింగ్ సమయం పూర్తికాలేదన్నారు. భారీ వాహనాల రాకపోకలతో వంతెన దెబ్బతింటుందన్నారు. మరో ఐదు రోజుల్లో కొత్త వంతెనను వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

బైక్ ఢీకొట్టడంతో ప్రమాదం



మహిమూద్ (ఫైల్)

బషీరాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. బషీరాబాద్ ఎస్ఐ నుమాన్ అలీ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిగకలాన్ గ్రామానికి చెందిన మహిమూద్(42) ఓ చిన్నకారు రైతు. కొద్దిపాటి పొలంలో కూరగాయలు పండిస్తూ భార్య ఫాతిమాబేగం, నలుగురు పిల్లలను పోషిస్తున్నాడు. మంగళవారం(19న) ఆయన కాయగూరలు విక్రయించడానికి నవల్గా వెళ్లి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో బొంరాస్‌పేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన రమేశ్ బైక్‌పై వేగంగా రావడంతో అదుపుతప్పి మహిమూద్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహిమూద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బంధువులు ఆయన్ని తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి యజమాన్ని కోల్పోయిన భార్య, తన నలుగురు పిల్లలు దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా రమేశ్ బైక్‌పై మరో ఇద్దరు ఉన్నట్లు సమాచారం.

ఫోర్జరీ చేసి.. నగదు కాజేసి

- తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అవినీతి బాగోతం
- రైతుల ఖాతా నుంచి డబ్బులు స్వాహా చేసిన ఉద్యోగులు



తాండూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకు

తాండూరు: తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అవినీతి బాగోతం బయటపడింది. బ్యాంకు ఉద్యోగులే నకిలీ ఖాతాలను సృష్టించి ఫిక్స్‌డ్ డిపాజిట్ డబ్బులను స్వాహా చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. పట్టణంలోని సాయిపూర్ రోడ్డులో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు రైతులకు సేవలను అందిస్తోంది. కొన్నాళ్ల క్రితం తాండూరుకు చెందిన ఓ రైతు బ్యాంకులో రూ.4 లక్షల నిధులను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ప్రేమ్‌సింగ్, అరవింద్ ఈ విషయాన్ని గమనించారు. ప్రేమ్‌సింగ్ తన బంధువు అజయ్‌తో కలిసి డబ్బులను స్వాహా చేసేందుకు పథకం రచించారు. అందుకు అదే బ్యాంకులో ఓ మహిళ పేరిట నకిలీ ఖాతా తెరిచారు. తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్ డబ్బులు విత్ డ్రా చేసుకొనేందుకు సదరు రైతు నుంచి సంతకాలు తీసుకున్నారు. అనంతరం నకిలీ ఖాతాలోకి డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేసుకొని పంచుకున్నారు.

పోలీసుల అదుపులో ఉద్యోగులు

ఇటీవల ఫిక్స్‌డ్ డిపాజిట్ డబ్బులను తీసుకొనేందుకు రైతు కుటుంబం బ్యాంకుకు వచ్చింది. మేనేజర్ ఖాతాను పరిశీలించి డబ్బులు డ్రా చేసుకుని మళ్లీ ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన రైతు కుటుంబం ఫిర్యాదు చేసింది. సంబంధిత పత్రాలు పరిశీలించి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన డబ్బులు పక్కదారి మళ్లించినట్లు మేనేజర్ శ్రీనివాస్‌రావు గుర్తించారు. దీనిపై ప్రైమ్ సింగ్, అరవింద్‌లపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. సీఐ సంతోష్ ఆధ్వర్యంలో ఇద్దరు ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పోలీసుల విచారణలో మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉంది.

గుంతలో ఇరుక్కుపోయిన ట్రక్కు

నందిగామ: ముఖ్యకూడలి వద్ద గుంతలో ఇరుక్కుపోయిన వాహనంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అంతిరెడ్డిగూడ శివారులోని ఓ ఐరన్ పరిశ్రమ నుంచి గురువారం ఇనుప రాడ్లను లోడ్ చేసుకుని వెళ్తున్న బొలెరో టీ టైం చౌరస్తా వద్ద ఉన్న గుంతలోకి ఇరుక్కుపోయింది. టైర్లు దిగబడటంతో అరగంట పాటు అక్కడే నిలిచిపోయింది. అసలే ప్రమాదకరమైన ఈ చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనంతో ఈ రూట్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఇబ్బంది పడ్డారు.